నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం అక్టోబర్ 03 2024 www.navatelangana.com

నవోదయలో ఖాళీ సీట్లకు భర్తీలకి ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్‌లోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అలాగే 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష వచ్చే సంవత్సరం 2025 ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు కోసం https://navodaya.gov.in వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు.

నీలాక్యాంప్‌లో ఒకరికి డెంగ్యూ

- గ్రామంలో లోపించిన పారిశుధ్యం

నవతెలంగాణ-రెంజల్


లోపించిన పారిశుధ్యం

రెంజల్ మండలం నీలా క్యాంప్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రత లోపించడంతో ఒకరికి డెంగ్యూ సోకినట్లు గ్రామస్తులు తెలిపారు. మురికి కాలువలలో చెత్తాచెదారం నిండుకొని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో జ్యోతి అనే మహిళకు డెంగ్యూ నిర్ధారణ జరిగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో వైద్య అధికారులు పర్యటించి పరిసర ప్రాంతాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గాంధేయ మార్గం ఆదర్శం

- అహింసతో అఖండ భారతావనికి స్వాతంత్ర్యం
- శాంతి, అహింస, సత్యం మార్గంలో నడవడమే మహాత్మాగాంధీకి నివాళి
- జయంతి వేడుకల్లో పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

గాంధేయ మార్గం అందరికి ఆదర్శం, అనుసరణీయమని గాంధీజీ సూచించిన శాంతి, అహింస, సత్యం మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అర్పించే నివాళి అవుతుందని పలువురు పేర్కొన్నారు. గాంధీ సన్మార్గంలో ప్రయాణిస్తూ నమ్మిన సిద్ధాంతాలను, విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్ల ఆయన కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం అయ్యాయని తెలిపారు. అహింసతోనే అఖండ భారతావనికి స్వాతంత్ర్య తీసుకొచ్చారని.. పోరాటానికి గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింస మార్గం భారతీయులకే కాదు.. యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందిని అన్నారు. గాంధీ జయంతి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



నిజామాబాద్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్.. కామారెడ్డిలో కలెక్టర్, ఎమ్మెల్యే


ఎస్పీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఎస్పీ

నిజామాబాద్ సిటీ : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ లో గల మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇరువురు జాతి నేతలు దేశానికి అందించిన సేవల గురించి కొనియాడారు. జాతిపిత చూపిన బాటలో పయనిస్తూ దేశాభ్యున్నతికి, సమాజ హితానికి పాటుపడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మేయర్ దండు నీతు కిరణ్ పిలుపునిచ్చారు. కాగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి : మహాత్మా గాంధీ జయంతి వేడుకలు కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సింధు శర్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం నిస్వార్థంగా మనమందరం సేవలు అందించాలని ఆయన ఆశయాల సాధనకు మనందరం కృషి చేయాలని అన్నారు. గాంధీజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, డి సి ఆర్ బి డిఎస్పి మదన్లాల్, ఏఆర్ డిఎస్పి యాకూబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జార్జ్, ఏఆర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, ఎస్సైలు,డిపిఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజ్ రోడ్‌లోని గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు.


ఎండలోనే నిలబడి ఉన్న మున్సిపల్ కార్మికులు, సిబ్బంది

మండుటెండలో మాడిన కార్మికులు

- స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో కనీసం టెంట్ ఏర్పాటు చేయని వైనం
- మున్సిపల్ కార్మికుల సేవలను పొడుగుతూనే మరోవైపు వారి ఇక్కట్లు విస్మరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


చెట్టు కంచెపై, చెట్టు కింద జాతీయ జెండాలు

జిల్లా పాత కలెక్టరేట్ గ్రౌండ్ లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కనీసం టెంట్ సౌకర్యం కూడా లేకుండా, వచ్చిన మున్సిపల్ కార్మికులకు నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. పాత కలెక్టర్ గ్రౌండ్ కు ఉదయం 8 గంటలకే కు మున్సిపల్ కార్మికులకు చేరుకోవాలని తెలియజేసినప్పటికీ 11 గంటల వరకు కూడా కార్యక్రమం ప్రారంభించకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందునా కనీసం సేద తీరాడానికి నిలువ నీడ కూడా లేకపోవడం కనీసం టెంట్ కూడా ఏర్పాటు చేయకపోవడంపై కార్మికులు వాపోయారు. ఆ ఎండ తీవ్రతకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని కావున సౌకర్యం అయినా ఏర్పాటు చేసి ఉంటే బాగుందని కార్మికులు వాపోయారు. కార్మికుల సేవలను ఒక వైపు కొనియాడుతూనే మరో వైపు వారి ఇక్కట్లను విస్మరించారనే అభిప్రాయాలు వ్యక్తమైయ్యాయి. కార్యక్రమంలో అనంతరం జాతీయ జెండాలు ఎక్కడ పడితే అక్కడే దర్శనమిచ్చాయి.

డాక్టర్ సార్ రావట్లే

- సిబ్బంది సమయం పాటించట్లే
- పీహెచ్‌సీ ఎదుట రోగుల ధర్నా


పీమెచ్‌సీ ఎదుట బైటాయించిన రోగులు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ఉత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అందుబాటులో ఉండటం లేదని పలువురు రోగులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ కొద్ది రోజుల నుండి అందుబాటులో ఉంటలేరని తెలిపారు. అదే విధంగా అందులో పనిచేసే సిబ్బంది సైతం సమయ పాలన పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. అధికారులు స్పందించి డాక్టర్ సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని కోరారు. స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తమని తెలిపారు.

అనుమతి లేకుండా డీజే నిర్వహించొద్దు

- ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

డీజే లైసెన్స్ అనుమతులు లేకుండా డీజే నిర్వహించరాదని ఆర్మూర్ ఏసిపి జే వెంకటేశ్వర్ రెడ్డి డీజే నిర్వహకులకు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, ముందస్తు అనుమతి తీసుకోకుండా డీజే నిర్వహించరాదని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ రూరల్ సిఐ కే. శ్రీధర్ రెడ్డి, బాల్కొండ ఎస్ఐ బి. నరేష్, ముప్కాల్ ఎస్ఐ వి.రజనీకాంత్, మెండోరా ఎస్ఐ జి. నారాయణ పాల్గొన్నారు.

తల్లిమందలించిందని బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

తల్లి మందలించినందని బాలిక(15) ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామా బాద్ జిల్లా కేంద్రం లోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఖిల్లారోడ్డు ప్రాంతానికి చెందిన ఓ బాలికను తల్లి మూడు రోజుల క్రితం మందలించింది. ఆడుకునేందుకు ఊరికే బయటకు వెళ్లొద్దంటూ కూతురిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో మనస్థాపానికి గురైన బాలిక ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను వైద్యం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందిన అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. కాగా మంగళవారం రాత్రి మళ్లీ అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మోడ్రన్ డంపింగ్ యార్డ్ ప్రారంభించిన అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-ఎడపల్లి


మోడ్రన్ డంపింగ్ యార్డు ప్రారంభోత్సవం

స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అదనపు కలెక్టర అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని స్మశాన వాటిక సమీపంలో రూర్బన్ పథకం కింద సుమారు 50లక్షల రూపాయలతో నిర్మించిన మోడ్రన్ డంపింగ్ యార్డ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ లాంఛనంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మోడ్రన్ డంపింగ్ యార్డ్ నిర్మించడం వల్ల గ్రామానికి ఎంతో దోహద పడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వివిధ రంగాలలో శిక్షణ పొందేందుకు మోడ్రన్ డంపింగ్ యార్డ్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, ఐకెపి ఎపిఎం సాయిలు, ఏపీవో శ్రీవాణి, జెడ్‌పి తాజా మాజీ ఉపాధ్యక్షురాలు, రజిత ఎల్లయ్య యాదవ్, ఎడపల్లి, జైతాపూర్ గ్రామాల సహకార సంఘాల అధ్యక్షులు పోల మల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజ్, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, స్వయం సంఘాల మహిళలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

137 కిలోల గంజాయి, 5 గంజాయి మొక్కలు దహనం


పట్టుబడ్డ గంజాయి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో గత కొంత కాలంగా పట్టుబడిన 137 కిలోల గంజాయి 5 గంజాయి మొక్కలను పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆదేశానుసారం దహనం చేసినట్లు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కామారెడ్డి జిల్లా ఎస్పి సింధు శర్మ ఐపిఎస్ నేతృత్వంలో యస్ఓపీ ప్రకారం బుధవారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి , కామారెడ్డి డి.ఎస్.పి నాగేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పి మదర్ లాల్, సిఐలు తిరుపయ్య, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసునుంచి తప్పిస్తామని రూ.9.29 లక్షలకు టోకరా



- డబ్బులు పంపాలని ఫోన్లు వస్తే నమ్మొద్దు : పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వచ్చిందని, ఆ ఫిర్యాదు రద్దు చేసేందుకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పి పోలీసుల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మొద్దని పట్టణ సీఐ చంద్రశేఖం రెడ్డి సూచించారు. డబ్బులు పంపించే ముందు స్థానిక పోలీసులకు లేదా 1930 ఫోన్ చేయాలని, సైబర్ క్రైమ్ కు రిపోర్ట్ చేయాలని సూచించారు. బుధవారం వచ్చిన ఫిర్యాదుపై ఆయన వివరాలను తెలియజేశారు.

కామారెడ్డి పట్టణానికి చెందిన కిషన్ రావు అనే వ్యక్తికి గత నెల 26వ తేదీనా గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుండి ఒక వ్యక్తి ఫోన్ చేసి, మేము ఢిల్లీ నుండి పోలీసులము మాట్లాడుతున్నాము, నువ్వు డ్రగ్స్ కేసు మనీలాండరింగ్ కేసు నందు ఉన్నావని, నిన్ను పట్టుకరావడానికి ఢిల్లీ నుండి పోలీసులు వస్తున్నారని తెలిపినట్టు చెప్పారు. తిరిగి అదే నెంబర్ నుండి మర్నాడు ఫోన్ చేసి నిన్ను అరెస్ట్ చేయకుండా ఉండాలంటే అకౌంట్లో ఎన్ని డబ్బులు ఉన్నాయో అన్ని డబ్బులు పంపమని, కేసు క్లియర్ అయిన తర్వాత ఆ డబ్బులను తిరిగి ఇస్తామని చెప్పడంతో, నాలుగు విడతలుగా మొత్తం రూపాయలు తొమ్మిది లక్షల ఇరవై తొమ్మిది వేల రూపాయలను (రూ. 9,29,000/-) వారు చెప్పిన అకౌంట్ కు ఇతని అకౌంట్లో నుండి ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఇది మోసమని గ్రహించి 1930 కి కాల్ చేసి చెప్పగా, పోలీస్ స్టేషన్ నందు ఇతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీరు కేసులలో ఉన్నారు, మీ కేసులను తీసివేయాలంటే డబ్బులు వేయమని అడిగితే, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికి డబ్బులు వేయొద్దని సూచించారు.

కార్మికుల సేవలు మరువలేము

- అర్బన్ ఎమ్మెల్యే, మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



కార్మికులకు ప్రశంసాపత్రాలు అందజేత

నిజామా బాద్ మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గత 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ హి సేవ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన కార్మికులకు, చెత్త వాహనాలు నడిపే డ్రైవర్స్, శానిటేషన్ పర్యవేక్షకులకు ప్రశంసా పత్రాలను నగర ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూ కిరణ్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ తో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు అందించే సేవలు ఎంతో విలువైనయని నగర ప్రజల ప్రజారోగ్యం దృశ్య ఉదయాన్నే మేల్కొని స్వచ్ఛ నిజామాబాద్ నగరంగా తీర్చిదిద్దడానికి ఏంతో కృషి చేస్తున్నారని విలువైన సేవలు అందిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో మంద మకరంద్ , డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ , అదనపు కమిషనర్ శంకర్, ఇంజనీర్లు పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ పట్టుబడ్డ ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్


ఫైల్

నిజామాబాద్ జిల్లా కేంద్రం రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం నిషేధించిన గంజాయిని అమ్ము తుండగా ఇద్దరిని అరెస్టు చేసినట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసీన్ అరాఫత్ బుధవారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బర్కత్‌పురా కాలనీలో నివాసముంటున్న అఫ్రోచ్, మునీఫ్ ఖాన్ ఇద్దరు నాందేడ్ లో గల కరీం అనే వ్యక్తి నుండి గంజాయి చిన్న, చిన్న ప్యాకెట్లు తీసుకొని వచ్చి నిజామాబాద్ పట్టణంలో విక్రయిస్తున్నాడు. ఇద్దరి వ్యక్తులపై చాలా రోజుల నుంచి నిఘా పెట్టి వీరిని బుధవారం పట్టుకున్నట్టు తెలిపారు. వీరి దగ్గర నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే వీరు ఒక్కో ప్యాకెట్ లో ఐదు గ్రాములు చొప్పున తయారు చేసి అమాయకులైన యువతకి 200 రూపాల నుండి 300 రూపాల వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం.

అఫ్రోజ్ ఖాన్ నిందితుడు ఇంతకు ముందు కూడా గంజాయి అమ్మిన కేసులు ఉన్నాయని వివరించారు. వీరిద్దరి దగ్గర మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్ సీజ్ చేశారు. గంజాయి సరఫరా చేసినా అమాయకులైన వారికి అమ్మినా దయచేసి పోలీసు వారికి సంబంధించిన వివరాలను తెలియజేయాలన్నారు. ఇటువంటి వాటిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఇలాంటి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

గౌడ కులస్తులకు అండగా ఉంటా

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్


మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

గౌడ కులస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. మహేష్ కుమార్‌గౌడ్‌ను జైగౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రంగోల్ల మురళిగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాటమయ్య రక్షణ కిట్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం గౌడ కులస్తులకు రక్షణ కల్పించిందన్నారు. అర్హులైన గీతా కార్మికులందరికీ లైసెన్సులు ఇప్పించాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సమస్యల సాధన కోసం తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం రాష్ట్ర నాయకురాలు అనురాధగౌడ్, జై గౌడ ఉద్యమం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికినట్టు ఎక్సైజ్ ఎస్ఐకి ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో తాటి చెట్లు నరికి వేశారని గౌడ సంఘ సభ్యులు బుధవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్సై ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 చెట్లను నరికివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షులు నరేష్ గౌడ్, సభ్యులు సాగర్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిజే సౌండ్ నిషేధం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని రకాల ఊరేగింపుల డీజే, సౌండ్ సిస్టం లపై నిషేధం విధించినట్టు ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో ఎటువంటి లౌడ్ స్పీకర్లను, పబ్లిక్ అడ్రస్ సిస్టంలను గాని, డీజే సిస్టం గాని ఉపయోగించొద్దని పేర్కొన్నారు. హాస్పిటల్స్, విద్యాసంస్థలను సైలెన్స్ జోన్‌గా పరిగణించి ఆయా ప్రదేశాల్లో అధిక శబ్దంపై నిషేధం ఉంటుందని తెలిపారు. డీజే నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్‌ను కలిగి ఉండాలని, ప్రోగ్రాం నిర్వాహకులు ఏదైనా కార్యక్రమం నిర్వహించడానికి ముందే నిజామాబాద్ ఏసిపి నుంచి పర్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లయితే వారిపై 223, 280, 292, 293, 324(2), 152 మరియు సెక్షన్ 15 పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.

సమస్యలపై పోరాటాలు చేస్తాం

నవతెలంగాణ-మాక్లూర్


మాట్లాడుతున్న సిపిఐ(ఎం) నాయకులు

ఆలూరు మండలంలోని రాంచంద్రపల్లి సిపిఐ(ఎం) శాఖ సమావేశం మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు వెంకటేష్ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. మూడు సంవత్సరాల పోరాటాల గురించి చర్చించారు. మున్ముందు పోరాటాలకు ముందుంటామని, పార్టీకి కట్టుబడి పని చేస్తామని అన్నారు. ఇడగొట్టి సాయిలు మాట్లాడుతూ పార్టీ నిబంధనలకు అనుగుణంగా ఉంటూ పార్టీ పిలుపులను అనుసరించాలని తెలిపారు. నూతన కార్యదర్శిగా ఇడగొట్టి సాయిలు, రెండవ కార్యదర్శి సుకన్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలలో సాస్టేనేబుల్ టీచర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం


అవగాహనా కల్పిస్తున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో బుధవారం (సాధన) సాస్టేనేబుల్ టీచర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప ఉపాధ్యాయులుగా కావడానికి ఎలాంటి విలువలు అవసరం అలాగే విద్యార్థులకు కూడా గొప్ప విద్యార్థి కావడానికి ఎలాంటి విలువలు పాటించాలో వివరించారు. ఒక స్కూల్ విజన్, మిషన్ అనేది ఎవరి ద్వారా సాధ్యమవుతుందన్న విషయాన్ని వివరించారు. అకడమిక్ స్టాండర్డ్స్, టీచింగ్ స్టాటజీస్ గురించి ఉపాధ్యాయులకు కొత్త మెలకువలను నేర్పించారు. కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. శ్రీభాషిత పాఠశాల 20 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం 15 వర్క్ షాప్స్ ఏర్పాటుచేసిన గొప్ప ఉపాధ్యాయులుగా తయారు చేసుకుంటుందన్నారు. ఇలాంటి వర్క్‌షాప్స్ ఏర్పాటు చేసి జిల్లాలోని ఒక గొప్ప విద్యాసంస్థగా పేరు పొందిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవసరమయ్యే వర్క్‌షాప్స్ ఏర్పాటు చేసి ఇప్పుడున్న పోటీ ప్రపంచానికి ధీటుగా వెళుతుందన్నారు. ఏనుగు శ్రీకాంత్ రెడ్డిని కరస్పాండెంట్ సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపల్ అసిస్టెంట్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో బుధవారం సచ్చత హి సేవలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి బి. చంద్రశేఖర్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. గ్రామ పంచాయతీ సమీపంలోని గాంధీ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి బి.చంద్రశేఖర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డి. ఆనంద్, ఉపాధ్యక్షులు పి. రాములు, ఏఎన్ఎమ్ మమత, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విఓఎలు, మహిళా సంఘాల సభ్యులు, రేషన్ డీలర్లు, బీపీఎం ప్రకాష్,నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ టోర్నీకి ఎన్‌జిఎస్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్, ప్రిన్సిపాల్, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

68వ రాష్ట్రస్థాయి హ్యాండ్ టోర్నమెంట్ నవ భారతి గ్లోబల్ పాఠశాల 7 మంది విద్యార్థులు బాలికల విభాగంలో పిఎన్ అంజలి శివాని, మోక్ష , ఇందూజ, బాలుర విభాగంలో వరుణ్, లిఖిత్, శ్రీ వర్ధన్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్, కరస్పాండెంట్ శ్రీదేవి బుధవారం తెలిపారు. ఇటీవల డిఎస్ఏ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలబాలికల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో నవ్య భారతి పాఠశాల జట్లు పాల్గొని బాలికల విభాగంలో 4-1 తేడాతో కామారెడ్డి జట్టుపై విజయం సాధించి టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు, కోచ్ అజ్మత్ ఖాన్‌లను పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆంటోనీ హెచ్ఆర్ లత, వైస్ ప్రిన్సిపాల్ సరిత ప్రత్యేకంగా అభినందించారు. వీరు నారాయణపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సైతం రాణించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి జరిగిందని ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రాపూర్‌కు చెందిన సురేష్(45), భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్టు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ బుధవారం తెలిపారు.

కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలి

- కెవీపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో బుధవారం నగర అధ్యక్షులు నలవాల నరసయ్య జిల్లా జెండా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆవిర్భవించి నేటికీ 26 సంవత్సరాలు అవుతున్నా యన్నారు. సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేసి దళితు లకు స్మశాన వాటిక, మూడు ఎకరాల భూమి, దళితులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సాధించుకున్నా మన్నారు.


నివాళులర్పిస్తున్న కెవీపిఎస్ నాయకులు

పోరాటాలద్వారా ప్రభుత్వం మెడలు వంచి అనేక పథకాలు సాధించుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో సంక్షేమ హాస్టల్లో సర్వే చేసి కాస్మోటిక్ చార్జీల కొరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. వాటిలో సౌకర్యాలు కొత్త బిల్డింగులకోసం చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని అన్నారు. వీడిసీల దౌర్జన్యా లకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టామని తెలిపారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహం కింద రూ.10 లక్షలు ఇవ్వాలని వారి పెళ్లిలను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.రాజు, నీరడి అనిల్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నరసింహులు, సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్


రైల్వే ఎస్ఐని సన్మానించిన పలువురు

అసిస్టెంట్ ఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కామారెడ్డిలో పనిచేస్తున్న జల సుధాకర్ రైల్వేలో ఆయన చేసిన మెరిటోరియస్ సర్వీస్‌కు గాను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి ఇండియన్ పోలీస్ మెడల్‌తో సత్కరించింది. దాని కోసం మెడల్ సాధించినందుకు నిజామాబాద్ ఆర్‌పిఎఫ్ పోస్ట్‌లో ఆయనను సత్కరించారు.

కారోబార్ పాండును విధుల్లోకి తీసుకోవాలి

- గ్రామస్తుల తీర్మానం
- తొలగించడంపై గ్రామ సభలో కార్యదర్శిని నిలదీసిన గ్రామస్తులు లేకుంటే ఆందోళన చేస్తాం
- తాజా మాజీ సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్ గౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి


గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

కారోబార్ పాండును విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తుల తీర్మానం మండలంలోని కుర్నాపల్లి కారోబార్‌ను తొలగించడంపై గ్రామ సభలో గ్రామస్తులు కార్యదర్శిని నిలదీశారు. ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తులు, తాజా మాజీ సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్ గౌడ్, డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని అన్నారు. బుధవారం మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గాంధీ జయంతి అనంతరం, గ్రామపంచాయతీలో కార్యదర్శి శ్రీనివాస్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ కొనసాగుతుండగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కారోబార్ పాండును తొలగించారిని గ్రామ సభలో వాగ్వివాదానికి దిగారు. 15 సంవత్సరాల నుండి కుర్నాపల్లి గ్రామపంచాయతీలో వెయ్యి రూపాయలజీతం నుండి విధులు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి ఆయన సేవలు చేశారని గ్రామస్తులు అన్నారు.

గ్రామ ప్రత్యేక అధికారి గ్రామ సభకు గైర్హాజరు కావడం పట్ల గ్రామస్తులు తీవ్రంగా మండిపడ్డారు. గ్రామంలోని కొందరు వ్యక్తులు తప్పుడు మాటలు చెప్పి ఆయనను తొలగించారని ఇందులో అధికారుల పాత్ర ఉందని గ్రామస్తులు ఆరోపించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాండుపై తప్పుడు నివేదికలను తయారుచేసి ఎంపీఓకు నివేదించా రన్నారు. అసలు విషయం తెలియని ఎంపిఓ మన్మోహన్ శాస్త్రి, డిపిఓ శ్రీనివాస్‌తో పాటు కలెక్టర్‌కు నివేదికలను పంపారని తెలిపారు. దీంతో జిల్లా స్థాయి అధికారులు కుర్నాపల్లి గ్రామ కారోబార్ పాండును తొలగించాలని డిపిఓ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీకి ఉత్వరులు రాగానే కార్యదర్శి సురేష్ కారోబార్ పాండును విధుల్లో నుంచి తొలగించారన్నారు. పాండుకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, పాండును తక్షణమే వీధిలోకి తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పాండును వీధుల్లోకి తీసుకోవాలని చివరికి గ్రామస్తులు తీర్మానం చేశారు.. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారితో గ్రామస్తులు, తాజా మాజీ సర్పంచ్ భర్త రవీందర్ గౌడ్ ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారుల అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామ సభలో 2025-26 సంవత్సరానికి గాను ఉపాధి పనుల ప్రణాళిక తయారీపై చర్చించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో 2025-26 సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులను గుర్తించాలన్నారు. అవసరమైన పనులను గుర్తించి గ్రామ పంచాయతీ ద్వారా తీర్మానం చేసి పంపితే, వాటి నిర్వాహణ కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి గ్రామ పంచాయతీలో నమోదు చేయించాలని, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఏర్గట్ల వాసికి ఓపెన్ కేటగిరీలో ఉపాధ్యాయ కొలువు



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన చంద్రవరపు దశగౌడ్ తన కలను సహకారం చేసుకున్నారు. డీఎస్సి నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి రోజుకు 10 నుండి 12 గంటలు కష్టపడి చదివి నిజామాబాద్ జిల్లాలోనే ఓపెన్ కేటగిరిలో 33వ ర్యాంక్ సాధించారు. ఎస్‌జిటీలో టీచర్ కొలువు సంపాదించాడు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ... గతంలో 2018 లో ఒకసారి డీఎస్సి పరీక్ష రాశానని కానీ ఉద్యోగం సంపాదించలేక పోయానని అన్నారు. నిరాశ చెందక, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఈ సారి రాసిన డీఎస్సిలో ఉద్యోగం సంపాదించానని అన్నారు. తనకు సహకరించిన తల్లిదండ్రులకు, ఆర్థికంగా వెన్ను తట్టి ప్రోత్సాహం అందించిన తన సోదరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

విజేత సిర్నపల్లి జట్టు


టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-ముప్కాల్

జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఒక్కరోజు కబడ్డీ టోర్నమెంట్‌ను బుధవారం ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ క్రీడా ప్రాంగణంలో అండర్-16 బాలుర 55 కిలోల విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొత్తంగా 14 జట్లు తలపడగా విజేతగా సిర్నపల్లి జట్టు, రన్నర్‌గా కిసాన్ నగర్ జట్టు నిలిచినట్లు క్రీడా నిర్వాహకులు తెలిపారు. విజేతలకు కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. పాల్గొన్న క్రీడాకారుల్లోంచి 40 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 3 నుండి 8వ తేదీ వరకు కోచింగ్ క్యాంప్‌ను ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్, పీఈటీలు అనిల్, సంజీవ్, ప్రేమ్, గంగా మోహన్, అరవింద్. యాదగిరి, సాయిలు, హరీష్, శ్రీను పాల్గొన్నారు.

వరదభాధితుల సహాయార్థం చెక్కు అందజేత


చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నవతెలంగాణ-ఎడపల్లి

మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకొని ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలోని ఇమేజ్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వరదభాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ మేరకు నిజామాబాద్ లోని గాంధీ చౌక్ లో గాంధీ జయంతి సందర్భంగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు పాఠశాల మేనేజ్మెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బుధవారం రూ. 16,116 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను గాంధీ వేషధారణలో చూసిన కలెక్టర్ విద్యార్థులను, స్కూల్ సిబ్బందిని అభినందించారు. పలువురు ప్రముఖులు, నేతలు గాంధీజీ వేషధారణలో ఉన్న విద్యార్థులతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ శైలజ మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం తమ పాఠశాల ఆధ్వర్యంలో గాంధీ జయంతి రోజున అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు నగదు రూపేణా, వస్తు రూపేణా విరాళాలు అందజేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఖమ్మం జిల్లాలో వరదలవల్ల నష్టపోయిన వరదబాధితుల సహాయార్థం విరాళాలు అందజేశామన్నారు.

నిషిత ఇంటర్నేషనల్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అమ్మ వెంచర్లో గల నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా నిషిత ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ వినయ్, రాజు మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థులకు మన సాంస్కృతి, సాంప్రదాయాలు కూడా తెలియజేయాలని బతుకమ్మ సంబరాలు నిర్వహించామన్నారు. చిన్నతనం నుండే అన్ని నేర్చుకుంటే వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారని తెలిపారు. పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మలను తయారు చేయగా తల్లిదండ్రుల సైతం బతుకమ్మలను తీసుకొని వచ్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిషిత ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ లత, నిషిత పాఠశాల ప్రిన్సిపల్ --రమిందర్ కౌద్ మోది, ప్రిన్సిపల్ స్వప్న, డైరెక్టర్ ఓంషేక్, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్న డీజేలకు అనుమతివ్వాలి

- ఏసీపీని కలిసిన సౌండ్ యూనియన్ సభ్యులు


ఏసీపీకి బొకేను అందజేస్తున్న యూనియన్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్న డీజేలకు అనుమతివ్వాలని ఎలక్ట్రానిక్స్, సౌండ్ అండ్ లైటింగ్ యూనియన్ సభ్యులు బదిలీపై నూతనంగా వచ్చిన ఏసీ పి వెంకటేశ్వర్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ సభ్యులు తమ సమస్యల్ని ఏసీపీ దృష్టికి తచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ వ్యాపారంలో ఉండి ఎవరినీ ఇబ్బందులకు గురిచేయకుండా తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. సీజన్ సమయంలో డీజే బ్యాన్ అనేసరికి ఇబ్బందికి గురయ్యామని, కనీసం తక్కువ సౌండ్ పెట్టి డీజేలకు పర్మిషన్ ఇవ్వాలని అభ్యర్థించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పెద్ద పెద్ద డీజే లు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బతుకమ్మల ఊరేగింపు, దుర్గామాత నిమజ్జన సమయంలో కూడా అట్టి డీజేలు పట్టణానికి వస్తే వాళ్లను అదుపులోకి తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నిజామాబాద్ సీపీ ఆదేశాల మేరకు పెద్ద శబ్దంతో వచ్చే డీజేలు పూర్తిగా బ్యాన్ చేసినట్టు వివరించారు. రెండు బాక్సులు పెట్టుకొని బతుకమ్మ సంబరాలు,దుర్గ మాత నిమజ్జనాలు ప్రజలకు ఇబ్బంది కలగకుండా జరుపుకోవాలని వివరించారు. రూల్స్ కు అతిక్రమించి ఎక్కువ సౌండ్ పెడితే చట్టరిత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రజనీష్ కిరాడ్, గణేష్, శివ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ ఆదర్శం

- రెడ్‌క్రాస్ తలసేమియా ఆస్పత్రి సందర్శించిన జిల్లా జడ్జి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సేవాకార్యక్రమాల్లో రెస్‌క్రాస్ ఆదర్శమని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకొని జిల్లా జడ్జి రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా వార్డ్‌ని బుధవారం సందర్శించారు. రెడ్‌క్రాస్ గణనీయమైన సేవలను అందిస్తూ రాష్ట్ర స్థాయిలోనే బంగారు పతకాలు అందుకొని ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సేవలు జిల్లాలో విశృతంగా జరుగుతున్నాయని అభినందించారు.రక్త నిధి సేవలు సైతం ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని, సంస్థ అందరికీ అందుబాటులో ఉండి విశిష్టమైన విలక్షణమైన సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తదుపరి రక్త దాతల సమన్వయ కర్త నరాల సుధాకర్‌ని చేపడుతున్న సేవలకు సత్కరించారు. అంతకుముందు జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, డా.నీలి రాంచందర్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వరులు, మెడికల్ ఆఫీసర్ డా.రాజేష్, నాగేందర్, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


జడ్జీని సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

- శ్రీనగర్ కాలనీవాసుల నిరసన


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని శ్రీనగర్ కాలనీ వాసులు నిరసనకు దిగారు. బుధవారం తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతిపిత గాంధీ జయంతి రోజున నగరంలోని శ్రీనగర్ కాలనీవాసులు శాంతి మార్గంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్రంతో ఫ్లెక్సీని రూపొందించి దానిపై తమ కాలనీ సమస్యలను వివరించారు. అర్బన్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ శ్రీనగర్ రోడ్డు నం.3 కాలనీ నిరాదరణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తారు రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణంతోపాటు 40ఫీట్ల రోడ్డుపై ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-కామారెడ్డి


ఆర్కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

పట్టణంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క బతుకమ్మ వేడుకలలో విద్యార్థినిలు వివిధ రకాల పువ్వులతో రంగు రంగుల బతుకమ్మలను తయారుచేసి, వివిధ రకాల వస్త్రాధారణలతో అందరిని అబ్బుర పరిచారు. కార్యక్రమంలో చైర్మన్, ప్రిన్సిపాల్ సి.హెచ్. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ విశిష్టత, ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి, ఆర్కే, గ్రూప్ ఆఫ్. సీఈఓ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ సదాశివరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి, డీన్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్

నవతెలంగాణ-కామారెడ్డి


కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు స్వామివారి చిత్రపటం అందజేత

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ హైదరాబాద్‌కు చెందిన ప్రాసిక్యూటర్‌లు మాచారెడ్డి మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని బుధవారం వారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయం తరపున ఘనంగా సన్మానించి, ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీధర్ రావు జూనియర్ అసిస్టెంట్లు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి


దోమకొండ: గ్రామసభలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ/సదాశివనగర్/పిట్లం/బీబీపేట్

దోమకొండ మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ముత్యం పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి తహసీల్దార్ సంజయ్ రావు, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయలలో అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభ సమావేశం బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీలో వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను గుర్తించాలని, గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ జీపీ డీపీపై గ్రామస్థులకు తెలిపారు. గ్రామ సభకు ఆయా శాఖల అధికారులు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆయా శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సంజయ్ రావు, మాజీ సర్పంచ్ అంజలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, నాయకులు సిద్ద రెడ్డి, రమేష్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : గాంధీ జయంతి పురస్కరించుకొని గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. శ్రమదానం చేపట్టి గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి సన్మానం చేసి బీమా పత్రాలు ఐడి కార్డులు అందజేశారు. గ్రామ సభల్లో జీపిడిపి 2025-26 తయారీ విధానం గ్రామంలో గల ముఖ్యమైన సమస్యలు చర్చిస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రాధాన్యత అంశాలు గుర్తించారు. ఉపాధి హామీ పనులు 2025 -26 సంబంధించి గ్రామంలో చేయగల పనులు ఫామ్ పాండ్ మునగ తోటలు పండ్ల తోటల పెంపకం వివిధ పనులపై చర్చించి ప్రణాళిక తయారు కోసం చర్చించారు. సదాశివనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ సంతోష్ కుమార్, కార్యదర్శి మాదవి లత, ఏపీవో మధు, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : పారిశుధ్య కార్మికుల సేవలు ఏనలేనివని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి అండ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కమలాకర్ అన్నారు. పిట్లం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుద్ధ కార్మికులు రేయింబవళ్లు పల్లె , పట్టణ , గ్రామాల పరిశుభ్రతకు చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం పంచాయతీ వాటర్ , విద్యుత్తు , సిబ్బందిని పూలమాల శాలువాలతో సన్మానించారు. కాగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమగ్ర భాగస్వామ్య ప్రణాళిక లో లో భాగంగా 2025 - 26 సంవత్సరం గాను ఉపాధి హామీ పనులను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో శివ , పంచాయతి సెక్రటరీ యాదగిరి , పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్ : బీబీపేట్ మండలంలోని బీబీపేట్, మల్కాపూర్, కోనాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, తుజాల్పూర్, యాడారం, శివారు రాంరెడ్డిపల్లి, మహమ్మదాపూర్, జనగామ, శేరి బీబీపేట్ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలలో అక్టోబర్ 2 గాంధీ జయంతి పురస్కరించుకొని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి గ్రామసభలు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పలు తీర్మానాలను చేయడం జరిగింది. అందులో భాగంగా గ్రామాలలో 1, ఆదాయ వ్యయాలు 2023-2024 సంవత్సరం నుండి అక్టోబర్ 9 2024 వరకు గ్రామపంచాయతీలలో ఖర్చులు మిగులు గ్రామసభల్లో చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రామాలలోని ప్రత్యేక అధికారులు దోమకొండ ఏవో పవన్ కుమార్, ఇరిగేషన్, ఏఈ పవన్ కుమార్, మండల ఎంపీడీవో బంతి పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీఓ కృష్ణ, సహకార సంఘం అధ్యక్షులు ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సదాశివనగర్‌లో...


పిట్లంలో...


బీబీపేట్‌లో...

సత్యాగ్రహమే ఆయుధం..

- గాంధీ జయంతి వేడుకల్లో పలువురు

నవతెలంగాణ-మద్నూర్

సత్యాగ్రహమే ఆయుధంగా.. అహింసా మార్గంలో పోరాడి కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని అందించిన జాతిపిత మహాత్మా గాంధీ అని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు కొనియాడారు. ఘనంగా నివాళులర్పించారు. మహాత్మ గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడుచుకోవాలని మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువ నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. దేశానికి స్వతంత్రం తీసుకురావడంలో మహాత్మా గాంధీ అహింస మార్గంలో సాధించి పెట్టారని గుర్తు చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో..

కామారెడ్డి :

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

పట్టణంలోని లయోలా హై స్కూల్లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ సంబరాలలో విద్యార్థులు, ఉపాధ్యాయురాలు ఆట పాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బి.చారి, పాఠశాల డైరెక్టర్ ఫహీం, ఉపాధ్యాయులు రాంగోపాల్, నీరజ విద్యార్థిని శ్రీమహీ మాట్లాడుతూ.. లయోలా హై స్కూల్ పాఠశాలలో ప్రతి సంవత్సరం జరుపుకునే బతుకమ్మ సంబరాలను ప్రతి సంవత్సరం లాగే అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి ఉత్సవాలను జిల్లా కేంద్రంలో నిర్వహించారు. పట్టణంలోని అశోక్ నగర్ కాలనీలో గల సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రీజనల్ కార్యాలయంలో 155 వ గాంధీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు.

లింగంపేట్ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం లింగంపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలతో నివాళులర్పించారు.

పెద్దకొడప్‌గల్ : పెద్ద కొడప్ గల్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాం సుధాకర్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ్, ఏంపిడిఓ లక్ష్మికాంత్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 6 వ వార్డు మున్సిపల్ పరిధిలో స్థానిక కౌన్సిలర్ ఆకుల రూప రవీందర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో పాటు మండలంలోని వివిధ గ్రామంలో వివిధ సంఘాల అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పుల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కామారెడ్డి : మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజి లో ఉన్న గాంధీజి విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి జి చిత్ర పటానికి బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డిలు పూల మాలలు వేసి నివాళులు అర్పించరు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పిట్లం మండల కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను ఆర్యవైశ్య మండల, పట్టణ , స్వతంత్ర సమరయోధుల కుటుంబాల , మండల పి ఆర్ టి యు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దోమకొండ : మహాత్మ గాంధీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి అన్నారు. ఆయా కార్యాలయాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

రామారెడ్డి : మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో, ఎమ్మార్వో కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో, మండల విద్యా వనరుల కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ గ్రామ గ్రామ సభలను నిర్వహించారు. ఉప్పల్వాయి, కన్నాపూర్ సభల్లో డిపిఓ వామన్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి రెడ్డి, ఏ పి ఓ ధర్మారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : గాంధీ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి సభ్యులు గంజ్‌లోని మహాత్మా గాంధీ కి పూలమాలతో నివాళులర్పించారు.


నిజాంసాగర్: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు


పెద్దకొడప్‌గల్‌లో...


ఎల్లారెడ్డిలో...


నాగిరెడ్డిపేట్‌లో...

మందు, మటన్ అమ్మకాలు

- పెత్తరమాస నేపథ్యంలో గుట్టుగా విక్రయాలు

నవతెలంగాణ-లింగంపేట్

ఒక వైపు పెత్తరమాస.. పెద్దలకు మాంసం, మందు పెట్టి నైవేద్యం పెట్టాల్సి ఉండగా.. మరోవైపు గాంధీ జయంతి.. జీవ హింస చేయొద్దనడంతో గందరగోళం నెలకొంది. అయితే పలు గ్రామాల్లో మాత్రం గుట్టుగా మందు, మటన్ అమ్మకాలు సాగాయి. గాంధీ జయంతి రోజు గ్రామాల్లో పట్టణ కేంద్రంలోని రహస్య ప్రదేశాల్లో మటన్ చికెన్ విక్రయాలు కొనసాగినట్లు సమాచారం. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జీవహింస చేయరాదని మహాత్ముడికి ఆత్మకు శాంతి కల్పించాలని రాజకీయ నాయకులు శాంతి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అర్పిస్తున్నారు. మరోవైపు అందుకు విరుద్ధంగా మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గిరిజన ప్రాంతాల్లో యదేచ్ఛగా మటన్ మందు విక్రయాలు కొనసాగినట్లు సమాచారం.

గాంధీ జయంతి పండుగ రోజే పూర్వీకుల పెద్దల అమావాస్య ఒకేరోజు రావడంతో పూర్వికులు ఆచార ప్రకారం పెద్దమనుషులకు ఇంట్లో నైవేద్యం సమర్పించడానికి మటన్ లేదా చికెన్‌తో నైవేద్యం మందు లేదా కల్లు సమర్పిస్తున్నారు. అదేవిధంగా కొంతమంది నైవేద్యం ముందు మందు పెట్టి పెద్దల ఆత్మకు శాంతి కలగాలని నైవేద్యం సమర్పిస్తుంటారు. ఇది ఇలా ఉండగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో సైతం మటన్, చికెన్ విక్రయాలు జరిగాయి. మద్యం మాత్రం రహస్య ప్రదేశాల్లో నిలువ ఉంచి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

దసరా క్రికెట్ ట్రోఫీ ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో దసరా పండగ సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న దసరా క్రికెట్ ట్రోఫీ క్రీడలు బుధవారం ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక గాంధారి ఎస్సై అంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూర్పు రాజులు, గురుకుల ప్రిన్సిపాల్ శరత్ చంద్ర , వడ్ల ప్రకాష్ యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల మొసలికన్నీరు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- అఖిలపక్షం తీరుపై కాంగ్రెస్ నాయకుల విమర్శ

నవతెలంగాణ-గాంధారి

రైతుల పట్ల అఖిలపక్ష నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పది సంవత్సరాలలో రైతుల ఉసురుతలిగి అధికారం కోల్పోయినా.. బీఆర్ఎస్ పార్టీ నాయకుల తీరు మారడం లేదని అన్నారు. గాంధారి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కాగుల మోహన్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికలలో సందర్భంలో లక్ష రూపాయల రుణమాఫీ అని ప్రజల ద్వారా ఓట్లు దండుకొని గతంలో బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ మిత్తి కిందికే బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారని, రైతులు అన్ని గమనించారని తెలిపారు.

రైతులకు అనుభవం లేదా నకిలి విత్తనాలతో రైతుల నడ్డి విరిచి రాక్షసనందం పొందిన మీరు రైతుల గురించి ధర్నా చేయడం దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా అనిపిస్తున్నది అన్నారు. కాంగ్రెస్ గవర్నమెంట్ అధికారంలోకి రాగానే మొదటగా నకిలీ విత్తనాలపై కొరడా జూలిపించి రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసిన ఘనత కాంగ్రెస్

ఘనంగా లియా పివి ఆవిర్భావ దినోత్సవం


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 61వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కదం నారాయణరావు మాట్లాడుతూ.... ఫెడరేషన్ ఆధ్వర్యంలో 1964 నుండి దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ఎల్ఐసి ఏజెంట్ ప్రయోజనాలను పరిరక్షించడంలో చెప్పుకోదగ్గ పాత్ర పోషించిందని, అంకిత భావంతో అనేక చరిత్ర ఆత్మకు నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఏజెంట్ జీవిత నాణ్యతను ఎంతగానో పెంచింది అన్నారు. ఏజెంట్లతో పాటు పాలసీ హోల్డర్ ప్రయోజనాల కోసం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో జాతీయ నాయకులకు కిషోర్ చందు, డివిజన్ నాయకులు మోహన్, శాఖ కార్యదర్శి ప్రదీప్ జైన్, కోశాధికారి ఉమాపతి, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్టు పయణం

నవతెలంగాణ-గాంధారి


బయలు దేరిన క్రీడాకారులు

43వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు కామారెడ్డి జిల్లా జట్టు బుదవారం నారాయణ్ ఖేడ్‌కు బయలుదేరి వెళ్లినట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సాయికుమార్, లక్ష్మన్ రాథోడ్ లు తెలిపారు. ఈ పోటీలకు జాతీయ స్థాయి లో గుర్తింపు ఉందని పోస్టల్, ఇన్కమ్ ట్యాక్స్ డిపార్ట్మెంట్‌లో ఈ క్రీడాకారులు ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. జిల్లాకు గుర్తింపు తేవాలని క్రీడాకారులకు ఆయన సూచించారు.

సమస్యలుంటే నేరుగా మంత్రులకు చెప్పొచ్చు

నవతెలంగాణ-బీబీపేట్

సమస్యలున్న వారు నేరుగా మంత్రులకు చెప్పే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని ఆ పార్టీ నాయకులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రజా సమస్యలు తీర్చేందుకు కాంగ్రెస్ శ్రేణులను కలిసేందుకు వారానికి రెండు రోజులపాటు రాష్ట్ర మంత్రులు గాంధీభవన్ లో ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు టీపీసీసీ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యకర్తలకు అండగా ఉండే విధంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా పాలన కార్యకర్తల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే పార్టీకి,ప్రభుత్వానికి విలువ పెరుగుతుందన్నారు. మంత్రులు ప్రజలతో, కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించడంతో పాటు వారు అందించే ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను పరిష్కరించడమే దీనికి నిదర్శనమన్నారు.


జక్రాన్‌పల్లి: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పలువురు


వర్ని: గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పలువురు


నిజామాబాద్ రూరల్‌లో...

శాంతి.. సహనం.. గాంధీజీ


ఆర్మూర్‌లో...


బాల్కొండలో...


భీంగల్‌లో...


బోధన్‌లో...



కంఠేశ్వర్‌లో...

●మహాత్మా గాంధీకీ ఘనంగా నివాళ్లు

మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని నాయకులు, అధికారులు, పలుసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసిన ఘనంగా నివాళ్లు అర్పించారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన పాత్రను కొనియాడారు. ప్రపంచ దేశాలు గుర్తించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని, ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని నాయకులు పేర్కొన్నారు. మహాత్మ గాంధీ చూపిన మార్గం శాంతి అహింస మార్గాల ద్వారా దేనినైనా సాధించవచ్చన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన వ్యక్తి మాహత్మ గాంధీ అని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ సిటీ : నగరంలోని గాంధీ చౌక్‌లో గల సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, వై రాజిరెడ్డి, కే.రాజన్న, సురేష్ కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే గ్రామ స్వరాజ్యం ఏర్పాటు అవుతుందని తెలిపారు.

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం గాంధీ చౌక్‌లో ఉన్న మహాత్మా విగ్రహానికి బిజెపి శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్వాతంత్ర సమరయోధులు ఫలితంగా అనుభవిస్తున్న స్వేచ్ఛ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే రాజకీయ స్వేచ్ఛ వచ్చిందని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ చిత్రపటానికి పార్టీ కార్యాలయంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తిలక్ గార్డెన్ సమీపంలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెడికల్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కే.శివప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్మూర్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండ్‌లో గాంధీ విగ్రహం వద్ద, జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని మహాత్మా గాంధీజీకి నివాళులర్పించారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నాయకులు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సిరికొండ : ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని అందించిన మహాత్మ గాంధీ, దేశ సమగ్రతకు, ఐక్యతకు కృషిచేసి లాల్ బహదూర్ శాస్త్రీ స్ఫూర్తితో సమాజ ప్రగతికి పాటుపడుదామని స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్ పేర్కొన్నారు. సత్యశోధక్ పాఠశాలలో బాపూజీ, శాస్త్రీల చిత్రపటాలకు సాల్మన్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.బాలయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బోధన్ : మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సాలూర, బోధన్ మండలాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలో తహసీల్దార్ శశిభూషణ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బోధన్ పట్టణంలోని గాంధీ పార్కులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో మహాత్మా గాంధీ జయంతిని, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్చతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఎన్.సీ.సీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో బాపు జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ బాల కృష్ణ గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళలు అర్పించారు.

భీంగల్ రూరల్ : మండలంలోని అన్ని గ్రామాలలో మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించారు.

వర్ని : ఉమ్మడి వర్ని, చందూర్, రుద్రూర్, మోస్రా మండల పంచాయతీ కార్యాలయ ఆధ్వర్యంలో, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, ప్రజానాయకులు మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో మహాత్మ గాంధీ చిత్ర పటానికి నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు.

నిజామాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

ఖానాపూర్‌లోని డివిజన్ అధ్యక్షుడు కొర్వ రాజేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జయంతిని నిర్వహించారు.

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో ఘనంగా మహాత్మ గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆర్మూర్ : పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ కాంప్లెక్స్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదను గుజరాతి తెలిపారు. భారత దేశ 2వ ప్రధానమంత్రి అయినా లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని వారు చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళలర్పించారు.

కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి, పూల మాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నేటి యువత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

బిసి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

భారత స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ,భారత మాజీ ప్రధామంత్రి భారత రత్న లాల్ బహుదూర్ శాస్త్రీ లకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. నిజామాబాద్ నగరంలోని గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తిలక్ గార్డెన్ వద్ద గల లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మాజీ పీసీసీ కార్యదర్శి రం భూపాల్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవల అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నాయకులు పోల ఉష, కోనేరు విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాల్కొండ : మండల పరిధిలోని కిసాన్ నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సచివాలయ కార్యదర్శి రేణుకా దేవి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు పురుషోత్తం, రాజలింగం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతిలో బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్, సీనియర్ నాయకులు కుందారపు శ్రీనివాస్, యూనుస్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. లయన్స్ అధ్యక్షుడు అందే వెంకట గిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెజరర్ కటికె శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ చైర్మన్లు చౌటి కిషన్, భూస రత్నాకర్, సభ్యులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాపూజి మందిరం వద్ద గల గాంధీజి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగపూర్ గ్రామంలో నిర్వహించిన గాంధీ జయంతిలో గ్రామపంచాయతీ కార్యదర్శి జె.వికాస్, కరోబార్ కలీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి సచ్చాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు, కాంగ్రెస్ నాయకులు రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాసిల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తాసిల్దార్ శ్రావణ్ కుమార్ పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

మాక్లూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో ట్రైనీ ఐఎఎస్, ఇంఛార్జి ఎంపీడీఓ సంకేత్ కుమార్ ఆధ్వర్యంలో, గ్రామ పంచాయతీలో కార్యదర్శి రాకేష్ ఆధ్వర్యంలో ఇతర కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపిఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెండోర : పోచంపాడ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఇరిగేషన్) కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనలో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, డిఈ లు, ఎఈలు, ఎఈఈలు సిబ్బంది పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతీ నగర్లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు హాజరయ్యారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరంలో ప్రధాన భూమిక పోషించి అహింస మార్గంలో భారతదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిన మహాత్ముడు మోహన్ దాస్ కరంచంద్ అని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కెసిఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు రమణారావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసూదన్‌రావు, తెలంగాణ శంకర్, అమరేందర్‌రావు, శేఖర్, రాజు, జీవన్‌రావు, అంజయ్య, మనోహర్రావు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు డిఐజి జోన్ 2 కార్యాలయంలో మేనేజర్ టి.రాజప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రేంజ్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు డిసిపి (ఎఆర్) శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజి అనుసరించిన అహింస, సత్యాగ్రహం, ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్నారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, పోలీస్ కార్యాలయం సిబ్బంది, సిసిఆర్‌బి సిబ్బంది, సిఎస్‌బి సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది హాజరయ్యారు.

ఎడపల్లి : మండలంలోని జానకంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాధా కిషన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకారం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి పోలీస్ స్టేషన్లో నిర్వహించిన గాంధీ జయంతిలో బోధన్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబు ఎస్సై వంశీకృష్ణారెడ్డి, ట్రైనీ ఎస్సై సుస్మిత, హెడ్ కానిస్టేబుల్ భీమ్ రావు, కానిస్టేబుల్, స్వాతి పాల్గొన్నారు.

మండంలోని మంగళ్ పాడ్, కుర్నపల్లి గ్రామాలలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, చిత్రపటాలకు యువకులు గ్రామ పెద్దలు నాయకులు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గ్రామపంచాయతీ కార్యదర్శులు రామిరెడ్డి, సురేష్, తాజా మాజీ సర్పంచులు సావిత్రి రవీంద్ర గౌడ్ బట్టు హనుమాన్లు, తాజా మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నాగరాజ్ వనజ నాగరాజ్ పాల్గొన్నారు.

మోపాల్ : మండల కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, మండల అభివృద్ధి అధికారి రాములు, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని నగర్ తండాలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రత్యేక అధికారి ఎస్తేరు రాణి, పంచాయతీ కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ధర్పల్లిలో...


డిచ్‌పల్లిలో...


కమ్మర్‌పల్లిలో...


మెండోరలో...


సిరికొండలో...


మోపాల్‌లో...

మంత్రిని పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని నియోజకవర్గం ఇంచార్జి వినయ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతి చెందడంతో హైదరాబాద్ కొండపూర్‌లోని మంత్రి స్వగృహం వెళ్లి పురుషోత్తంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రితో పాటు అయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు.



నివాళ్లు అర్పిస్తున్న వియన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. పద్మనగర్ రోడ్ నెంబర్-1కు చెందిన కట్ట లలిత (53) కడుపు నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపం చెందింది. ఈక్రమంలో గతనెల 27న ఇంట్లో బాత్రూంలోకి వెళ్లి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. మృతురాలి అన్న తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారని ఎస్ఐ వివరించారు.

డిజిటల్ హెల్త్ కార్డ్ సర్వే కోసం

పైలెట్ ప్రాజెక్ట్‌గా సాంపల్లి

- కుటుంబ సభ్యులు అనుమతిస్తేనే ఫొటోలు తీస్తాం
- ఇన్చార్జి డీపీవో శ్రీనివాసరావు వెల్లడి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సాంపల్లి గ్రామాన్ని కుటుంబ డిజిటల్ హెల్త్‌కార్డ్ సర్వే కోసం ఎంపిక చేసినట్టు జిల్లా ఇన్చార్జి డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. నేటి నుంచి సాంపల్లిలో సర్వే ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. ఐదురోజుల పాటు చేయనున్న ఈ సర్వేపై మంగళవారం నడిపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఈ గ్రామంలో 198 కుటుంబాలు ఉన్నాయని, వీరందరికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సర్వే కొనసాగుతుందని, కుటుంబ సభ్యులందరు అనుమతిస్తేనే ఫొటోలు తీసుకుంటారని తెలిపారు. యూనిక్ ఐడి కార్డు అయిందున ప్రజలు సమయం కెటాయించి సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఎక్కడైన ఆన్‌లైన్‌లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, పర్యవేక్షకులు నివేదిత, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నీట్టు కిషన్ రావు, వివిధ శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతన్న డీపీవో శ్రీనివాస్‌రావు

ఉపాధి పనులు గుర్తించడంకోసం గ్రామసభలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని సీతాయిపేట తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్టు ఎంపిడిఓ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో గ్రామంలో జాతీయ ఉపాధి పథకంలో చేయవలసిన పనులను గ్రామస్తులు అధికారులకు తెలపాలన్నారు. చేయవలసిన పనుల ప్రతిపాదనలను గ్రామ కార్యదర్శి తీర్మానించి నీవేదికను ప్రభుత్వానికి పంపాలన్నారు. తద్వారా రానున్న సంవత్సరంలో దశలవారీగా చేసుకునే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామస్థులు లోక్కిడి రాములు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళ సంఘాల మహిళలు, గ్రామస్థులు, పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

31వరకు ఉచిత షుగర్ టెస్టులు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల ప్రజలకు నెలరోజులపాటు ఉచిత షుగర్ టెస్టులు నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ అధ్యక్షుడు అందే వెంకటగిరి బుధవారం తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 31 వరకు ఉచిత షుగర్ టెస్ట్‌ల నిర్వహణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

- జూట్ బ్యాగులు పంపిణీ
- గాంధీ జయంతి వేడుకలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహాత్మాగాంధీ అడుగు జాడల్లో యువత, విద్యార్థులు నడవాలని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, సిబిసిఎఫ్ పిఓ బి.ధర్మ నాయక్, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, అధ్యాపకులు కలసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మహాత్మా గాంధీ సుదీర్ఘ పోరాటంతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రతీ ఒక్కరు ఆ మహనీయుడి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ ఎస్ ఎస్, సీటీసీ మరియు నెహ్రూ యువ కేంద్రం, కళాశాల ఆధ్వర్యంలో "స్వచ్ఛత హి సేవా" శ్రమదానం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. వారి సేవలను కొనియాడుతూ దుబ్బ ఏరియాలో జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీక్, రంగరత్నం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.ఈ.వెంకట రమణ, జి. నాగ జ్యోతి, జి. సుధాకర్ రావు, ఎం.నరేష్, ఎం.దస్తప్ప, ఎం.రజిత పాల్గొన్నారు.

మహాత్మునిపై వినూత్నంగా ప్రచారం

గాంధీ సిద్ధాంతాలు తెలిపేందుకు సామాజిక సేవకుడి యత్నం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణానికి చెందిన అబుల్ హుస్సేన్ బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆటోకు మైక్ కట్టుకొని గాంధీకి సంబంధించి పాటలతో వినూత్న రీతిలో పట్టణంలో వీధి వీధినా తిరుగుతూ ఘన నివాళులు అర్పించాడు. 82 ఏళ్ల ముదిమి వయసులో దేశభక్తి సమాజశక్తిని క్రోడీకరించి యువతకు ఆదర్శంగా నిలుస్తూ సిద్ధాంతాలు ఆశయాలను అందరికీ ఆచరనీయంగా ప్రబోధిస్తూ ప్రచారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మహనీయు, ఆశయాల అడుగుజాడల్లో మనమందరం నడవాలని దేశ రక్షణ కై సంసిద్ధులై ఉండాలని ఆటోకు ఫ్లెక్సీ కట్టుకొని, ఆటోపై కొటేషన్స్ రాయించుకొని, సమాజ మార్పు కొరకు తపిస్తూ నూతన ఒరవడితో ప్రచారాన్ని చేస్తున్న ఆర్మూర్ గాంధీ సామాజిక సేవకున్ని అభినందిస్తున్నారు. ఆటోలో ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ అనాధలకు అభాగ్యులకు బాసటగా నిలుస్తూ సందర్భోచితంగా బీదలకు చేయూత నందిస్తూ తన వంతు బాధ్యతగా సమాజం మార్పు కోసం తపిస్తూ మానవతా విలువలతో సమ సమాజ స్థాపన కొరకు కృషి చేస్తున్న సామాజిక సేవకుడు అబుల్ హుస్సేన్ సేవలను చూసిన ప్రతీ ఒక్కరూ అభినందిస్తూ ఇలాంటివారు నేటి సమాజానికి అవసరమని అంటున్నారు.

నాగపూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో శ్రమదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/రెంజల్

మండలంలోని నాగపూర్, కమ్మర్ పల్లి గ్రామాల్లో బుధవారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చీపురులతో రోడ్లను ఊడ్చి, రోడ్లపై నుండి చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల పంచాయతీల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామం అందంగా ఉండాలంటే రోడ్లు, డ్రైనేజీలు బాగుండాలన్నారు. ప్రజలు చెత్తాచెదారం రోడ్లపై, డ్రైనేజీలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంట్లోనే చెత్తబుట్టలో నిల్వ ఉంచడం ద్వారా గ్రామాలను పరిశుభ్రత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీలకు సహకరించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిని ఆ గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలే తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, సంధ్య, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రమా, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ :మండలంలోని బాగేపల్లి గ్రామ పంచాఅతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి, స్వచ్ఛహీ సేవ కార్యక్రమాలను గ్రామ ప్రత్యేక అధికారి హెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలను వేసి ఘనంగా గాంధీ జయంతి వేడుకలను జరుపుకున్నారు.



కమ్మర్‌పల్లి మండలంలో..



రెంజల్ మండలంలో..

బతుకమ్మ సంబరాలు

- పాల్గొన్న నగర మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రోటరీ నగర్ లోని అయోధ్య రామ మందిరం ప్రాంగణం లో నిర్వహించి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మేయర్ దండు నీతూ కిరణ్ పాల్గొన్నారు. నిజామాబాద్ నగర ప్రజలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. కార్యక్రమంలో రోటరీ నగర్ అయోధ్య రామమందిర్ ప్రాంత వాసులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి

అనుభవ పూర్వక విద్య అవసరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి అనుభవ పూర్వకమైన విద్య ఉండాలని బాలోత్సవ్ రిసెప్షన్ కమిటీ చీఫ్ పాట్నర్ డాక్టర్ జయనీ నెహ్రూ తెలిపారు. నిజామాబాద్‌నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో బాలోత్సవ్ ఉపాధ్యాయులకు బుధవారం రెండు రోజుల శిక్షణను జయనీనెహ్రూ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు బట్టీ చదువులు కాకుండా ఆటపాటలతో చదువు నేర్పించడం కోసం నవంబర్ 8, 9వ తేదీల్లో నిజామాబాద్‌లోని ప్రెసిడెన్సీ పాఠశాలలో బాలోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి జరగాలని అంటే అనుభవ పూర్వకమైన విద్య ఉండాలని, అది కేవలం ప్రయోగాల ద్వారా, ఫీల్డ్ విజిట్స్, పరిశీలన విశ్లేషణ, నైపుణ్యాభివృద్ధి, భావోద్వేగాల నియంత్రణ, జ్ఞాన సముపార్జన జరగాలని అన్నారు. అందుకు ఈ బాలోత్సవంలో నేర్చుకోవడం, తెలుసుకోవడం వంటి పద్ధతుల ద్వారా లో కాస్ట్ -నో కాస్ట్ టీచింగ్ పరికరాల ద్వారా విద్యార్థులకు చదువు నేర్పుతామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత నర్ర రామారావు అన్నారు. బట్టీ చదువులు కాకుండా సృజనాత్మకతను వెల్లివిరిసే విధంగా ఆటపాటలతో బాలోత్సవం నిర్వహిస్తున్నామని బాలోత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అన్నారు. నవంబర్ 8, 9వ తేదీలలో నిర్వహించబోయే నిజామాబాద్ బాలోత్సవంలో పూర్వ నిజామాబాద్ మండలం నుంచి సుమారు 3000 మంది విద్యార్థులు పాల్గొంటారని బాలోత్సవ కమిటీ కోశాధికారి కె. రామ్మోహన్ రావు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌తో పాటు మాస్టర్ రిసోర్స్ పర్సన్ చంద్రయ్య, కే. నరసింహులు జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు, గగన్ కుమార్, విజయానందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జయనీనెహ్రూ

అసమానతలు లేని సమాజాన్ని సాధించడమే కేవీపీఎస్ లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసమానతలు లేని సమాజాన్ని సాధించడమే కేవీపీఎస్ లక్ష్యమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పవార్ జితేందర్, రెంజర్ల ప్రవీణ్ అన్నారు. బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 26వ ఆవిర్భావం దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పవార్ జితేందర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న ఆత్మగౌరవం సమానత్వం కులనిర్మూలన లక్ష్యాల సాధన కోసం అంటరానితనం కులవివక్షతకు వ్యతిరేకంగా కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కులవివక్ష అంటరానితనంపై వందలాది గ్రామాల్లో వేలాదిమంది కార్యకర్తలచే సర్వేలు అధ్యయనాలు నిర్వహించి సుమారు 128 రకాల కులవివక్ష రూపాలను వెలికి తీసిందన్నారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర కేవీపీఎస్ సంఘానికి దక్కిందన్నారు. 2004 నుంచి 2013 వరకు సుమారు 10 ఏండ్లు దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని చట్టం చేయాలని కేవీపీఎస్ అనేక సంఘాలు కలుపుకొని పోరాడి 2013లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సాధించిందన్నారు. జిల్లాలో దళితులపైన జరిగిన దాడులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి, బాధితుల పక్షాన నిలబడిందన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలుకై పోరాడుతున్నామన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, పరువు హత్యలను అరికట్టాలని ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, బ్ల్యూభీం అధ్యక్షులు ప్రేమేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ జిల్లా నాయకులు పూసం సచిన్, ఆత్రం కిష్టన్న, విష్ణు, కె.ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ డీఎస్సీ వేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏజెన్సీ డీఎస్సీ వేయాలని, గిరిజన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఏస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 17న కుమురం భీం వర్ధంతి సందర్భంగా గ్రామగ్రామాన వర్ధంతి కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏజెన్సీ డీఎస్సీ వేయాలని గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కుమురం భీం స్ఫూర్తితో షెడ్యూల్ ప్రాంత పరిరక్షణ, షెడ్యూల్ హక్కుల సంరక్షణకు గ్రామాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భీం పోరాడిన జల్ జంగల్ జమిన్ ఇప్పటికి ఆదివాసులకు అందని ద్రాక్షలా ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను మరింత దుర్భర పరిస్థితి నెట్టే విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు మడవి నాగోరావ్, భీంరావు, నాయకులు ఆత్రం కిష్టన్న, మేస్రం నర్మదా మహేష్, కనక మలుకు పాల్గొన్నారు.

జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కష్టపడి చదివి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. డీఎస్సీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలలో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ షేక్ ఇంజమాముల్ హక్ చెల్లెలు షేక్ షిరీన్ పర్వీన్ రాష్ట్రంలోనే స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలోని ఉర్దూ మీడియంలో 80.03 మార్కులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని డీఎస్సీ ఎస్జీటీలో 79 మార్కులతో రెండో స్థానాన్ని సాధించిందన్నారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, డీఎస్సీలలో మొదటి స్థానాలను సాధించిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం పోలీస్ కార్యాలయంలో విద్యార్థినిని శాలువాతో సత్కరించి, బహుమతిని ప్రధానం చేసి అభినందించారు. మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబ సభ్యుల పేరును జిల్లా పోలీసుల కీర్తిని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లాలని సూచించారు. అన్నయ్య ఒకవైపు ఉద్యోగం చేస్తూ, కుటుంబ బాధ్యతలను మోస్తూ చెల్లెలు చదువుకు కావాల్సిన వాటిని అందిస్తూ తనను ప్రోత్సహించడం జరిగిందని, విద్యార్థిని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్సై జైస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు తండ్రి మెహబూబ్, అన్నయ్య షేక్ ఇంజమాముల్ హక్, తమ్ముడు ఇమ్రాన్, నజీర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గడ్చందా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఒళ్ళపు ముత్యం(60) రెండు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసయ్యాడు. చిన్నచిన్న విషయాలకు కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్యం తాగడానికి భార్యకు డబ్బులు అడగగా అమే ఇవ్వకపోవడంతో ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామ సమీపంలో గల గోవింద చెరువులో శవమై కనిపించాడు. భార్య ఒళ్లపు నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.